క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చిస్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి రూ.లక్ష సాయం



బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న భర్ణికాన సాయినాథరావు

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దంపతులకు మంగళవారం జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భర్ణికాన సాయినాథరావు రూ.లక్ష అందజేశారు. వివరాలు.. మండంలోని అసకపల్లి శివారు ఎర్రవానిపాలేనికి చెందిన కోన కనకరాజు అతని భార్య కోన పైడికొండ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయాన్ని గ్రామస్తులతో పాటు యాదవ సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.వెంటనే స్పందించి తన వంతు సాయం అందజేశారు.

20 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: ఒడిశా నుంచి కారులో గంజాయి తరలిస్తుండా నగర టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సరిపల్లి చెక్ పోస్టు వద్ద పట్టుకున్నారు. వివరాలు..ఒడిశా ప్రాంతం నుంచి ఓ కారులో నలుగురు వ్యక్తులు దాదాపు 20 కిలోల గంజాయి తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు సరిపల్లి చెక్ పోస్టు వద్ద కారును అడ్డుకుని గంజాయితో పాటు రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ వెల్లడించారు.

15 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: పరవాడ, తానాం గ్రామాలకు చెందిన ఇద్దరు అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం సీసాలను పరవాడ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పరవాడ గ్రామానికి చెందిన డి.యశోద కృష్ణ వైన్ షాపు నుంచి 10 మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలిస్తుండగా.. తానాం గ్రామానికి చెందిన ఎ.లక్ష్మణరావు వైన్ షాపు నుంచి 5 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బాలసూర్యారావు చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

వ్యక్తికి గాయాలు

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలోని అసకపల్లి సర్వీస్ రోడ్డు వద్ద లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి.దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వివరాలు.. మండలంలోని అసకపల్లికి చెందిన వాకాడ రాంబాబు తన అత్తారి ఇల్లు గణపతిపురం నుంచి స్వగ్రామం ద్విచక్రవాహనంపై సోమవారం సాయంత్రం వెళ్తున్నాడు. అసకపల్లి ఫ్లైఓవర్ వద్ద ద్విచక్రవాహనం సర్వీస్ రోడ్డు దాటుతుండగా పెందుర్తి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాంబాబు కాలు విరగడంతో స్థానికుల సహాయంతో సబ్బవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికాస కేంద్రాలు C/o అంగన్‌వాడీలు

నాడు: **చిన్నారుల వయసుకు తగిన ఎత్తు, తగిన బరువు లేకపోయినా ఆ సమస్యను పరిష్కరించే దిశగా నాటి ప్రభుత్వం ఆలో**చించలేదు. అంగన్‌వాడీలను కూడా కేవలం సరకుల పంపిణీ కేంద్రాలుగా చూసేవారు. అరకొర సరకులు ఇచ్చి మమా అనిపించేవారు. ఫలితంగా చిన్నారులతో పాటు గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందక అనారోగ్యాల బారిన పడేవారు. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక పిల్లలు, సిబ్బంది అవస్థలు పడేవారు.

నేడు: **చిన్నారుల జీవితంలో మొదటి ఐదేళ్లు అత్యంత క్లిష్టమైన దశ అని నేటి ప్రభుత్వం గుర్తించింది . పిల్లల్లో అభిజ్ఞ, భావోద్వేగ,** సామాజిక వికాసానికి సురక్షితమైన, స్వచ్ఛమైన వాతావరణం ఉండాలని సంకల్పించింది. అందుకు తగ్గట్టుగా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేసింది సర్కారు. పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంది. ప్రాథమిక విద్య అందిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలను వికాస కేంద్రాలుగా నడిపిస్తోంది.



చింతగట్లలో ముస్తాబైన అంగన్‌వాడీ కేంద్రం

- సుందరంగా భవనాలు
- కేంద్రాల్లో సౌకర్యాల కోసం భారీగా నిధులు
- 111 కేంద్రాలకు రూ.48.19 లక్షల కేటాయింపు



డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు(ఫైల్)

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌డీ కేంద్రాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. పిల్లల జ్ఞాన సముపార్జనకు తొలి మెట్టుగా భావించే అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. అద్భుత ఫలితాలు సాధిస్తున్న నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం/మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్రాలను అందంగా తీర్చిదిద్దుతోంది. కొత్త భవనాల నిర్మాణం, పాత భవనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం, ఆన్‌లైన్ హాజరు వంటి సంస్కరణలతో ముందడుగు వేసింది. దీంతో ఒకప్పుడు ఉప్మా బడిగా పేరొందిన అంగన్‌వాడీలు నేడు పిల్లల వికాస కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పిల్లలు ఉత్సాహంగా క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.

అంతా నిర్లక్ష్యమే:

గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యమై దాదాపు ఉనికి కోల్పోయాయి. చిన్నారులకు మానసిక పరిపక్వత కల్పించాల్సిన ఈ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను కేంద్రాలకు పంపడానికి వెనుకడుగు వేసేవారు. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోగా..మరికొన్ని అసౌకర్యాల నడుమ కాలం వెళ్లదీసే దుస్థితి ఉండేది. సరైన నిఘా, నియంత్రణ లేక పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పటిందనే ఆరోపణలు కోకొల్లలు.



సరిపల్లిలో మరమ్మతుల తర్వాత సుందరంగా అంగన్‌వాడీ కేంద్రం

నేడు సమూల మార్పులు

ప్రస్తుతం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి తక్షణమే కృషి చేసింది. పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని 111 (పెందుర్తి మండలంలో 44, గాజువాకలో 26, పెదగంట్యాడలో 41) అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి 'మన అంగన్‌వాడీలు నాడు–నేడు' పేరిట రూ.48.19 లక్షలు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించింది. గత ఐదేళ్లుగా పీపీ–1 పేరుతో 3 ప్లస్, పీపీ–2 పేరిట 4ప్లస్ పిల్లలకు ప్రతీ రోజూ ఆటలు, పాటలు, ఇంగ్లిష్ బోధిస్తున్నారు.

మెనూ అదుర్స్

చిన్నారులకు ఉదయం 10 గంటలకు కోడిగుడ్డు, అనంతరం పాలు ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజన మెనూలో భాగంగా హాట్ పొంగల్, వెజ్ పలావ్, పులిహోర, వెజిటబుల్ రైస్, సాంబార్ బాత్, లెమన్‌రైస్, అన్నం, ఆకుకూర రైస్, స్వీట్ పొంగల్, గ్రేవీ కర్రి, దొండకాయ చట్నీ, ఆలూ కుర్మా, ఆకుకూర పప్పు, టమాటా చట్నీ, పప్పు చారు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

- ఏడు నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులకు నెలకు 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తున్నారు.
- గర్భిణులు, బాలింతలకు నెలలో వైఎస్సార్ కిట్ పేరుతో రెండున్నర కిలోల రాగి(చోడి)పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల పప్పు చెక్కి, 250 గ్రాముల కర్జూరం, 250 గ్రాముల బెల్లం, 3 కిలోల బియ్యం, అరకిలో నూనె, కిలో కందిపప్పు, 25 కోడిగుడ్లు, 25 పాలు ప్యాకెట్లు అందిస్తున్నారు.

అప్పన్న దేవస్థానానికి మైక్ సెట్ బహూకరణ



ఈవోకు మైక్ సెట్ అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి మంగళవారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు రూ.65 వేలు విలువ చేసే మైక్‌సెట్ బహుమతిగా అందజేశారు. సింహగిరిపై శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి మైక్‌సెట్ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, వంకాయల సాయి నిర్మల, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు,ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జోన్-8 ఇన్‌చార్జిగా ముమ్మన



పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 93, 94, 95, 96, 97, 98 వార్డుల వైఎస్సార్‌సీపీ ఎన్నికల సమన్వయకర్తగా 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడును నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. మే 13న జరిగే పోలింగ్ వరకు ఆయా వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను ముమ్మన పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాం



నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అన్నారు. బీసీలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారని..రెండోసారి సీఎంగా బాధ్యతలు తీసుకోగానే బీసీలకు మరింత మంచి చేసేందుకు వైఎస్ జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లువలస సన్నిబాబు, ప్రతినిధులు ఆరిపాక సత్యనారాయణ, కింతాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పెదగాడిలోని అభయాంజనేయస్వామి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల వంటలతో నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. దాదాపు 3 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ కేసుబోయిన లావణ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కేసుబోయిన త్రినాథ్, కృష్ణ, బంధం నగేష్, నారాయణరెడ్డి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ముత్యమాంబ పండగకు విస్తృత ఏర్పాట్లు



ముత్యమాంబ మూలవిరాట్, ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం

సబ్బవరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం,భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకున్న అంతకాపల్లి,బంగారమ్మపాలెం గ్రామాల్లో కొలువైన ముత్యమాంబ పండగను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారి తొలేళ్ల సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఘటాలు,గరగలు ఊరేగింపు నిర్వహించనున్నారు. 28న గురువారం అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా పలు వైదిక,ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఆ రోజు వేకువజామున 3 గంటల నుంచి అమ్మవారికి దూపదీప నైవేద్యాలు,పంచామృతాభిషేకాలతో ప్రత్యే పూజలు ప్రారంభమవుతాయి.సాయంత్రం భారీ మందుగుండుతో అనుపు మహోత్సవం జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకల సౌకర్యాలు కల్పించినట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి,జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు,వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తెలిపారు.

ఆనందగజపతికి ఘన నివాళి



ఆనందగజపతిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివగంత పూసపాటి ఆనందగజపతిరాజు వర్ధంతిని దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆనందగజపతిరాజు చిత్రపటానికి దేవస్థానం ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు సునీల్, విక్రమ్, హరి, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి పళ్లెం బహూకరణ



ముత్యమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులకు వెండి పళ్లెం అందజేస్తున్న దృశ్యం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి గుండా పెద్ద దివాణం అర కిలో వెండి పళ్లెం మంగళవారం ముత్యమాంబ అమ్మవారికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ముత్యమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు కూండ్రపు సన్యాసినాయుడు, కూండ్రపు చిన్నంనాయుడు, కూండ్రపు మధు పాల్గొన్నారు.

దేవతలారా దీవించండి

- భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల పండగలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీలు
- భారీగా అన్నసమారాధనలు



ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ అమ్మవారు, పైడిమాంబ అమ్మవారు, పోలమాంబ, పరదేశిమాంబ

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో కొలువుదీరిన ముత్యమాంబ, పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ గ్రామ దేవతల పండగను ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గ్రామ దేవతల ఆలయాలను రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. వీధులను అందంగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో భారీ సెట్టింగులను ప్రదర్శించారు. పండగ వేళ మంగళవారం భక్తులకు దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు జరిపారు.

- ముత్యమాంబ పండగను నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముత్యమాంబ, పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఉన్నారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, మాజీ సర్పంచ్ కూండ్రపు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామూర్తి గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో వేలాది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రికి అమ్మవారిని నాయుడుపాలెం నుంచి డప్పు వాయిద్యాలు, డ్యాన్సులు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆలయానికి తోడ్కొని వచ్చి భారీ బాణసంచా కాల్పులతో అనుపు మహోత్సవం నిర్వహించారు.
- పరవాడలో వెలసిన పైడిమాంబ అమ్మవారిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భారీ బాణ సంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
- తానాంలో కొలువుదీరిన పరదేశిమాంబ పండగను అట్టహాసంగా నిర్వహించారు. అమ్మవారిని సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, గ్రామ పెద్దలు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి ఏర్పాటు చే సిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- దేశపాత్రునిపాలెంలో కొలువుదీరిన పోలమాంబ అమ్మవారిని గ్రామ పెద్దలు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి పూజలు జరిపారు. డప్పులు, కోయడ్యాన్సులు, నేల డాన్సులు, భారీ బాణసంచా కాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహించారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు గ్రామ దేవతలను దర్శించుకొని పూజలు చేశారు.



దేశపాత్రునిపాలెం పోలమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు



ముత్యమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

ఇగ్నోలో అడ్మిషన్లకు గడువు పెంపు

గాజువాక : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో అడ్మిషన్ల గడువును ఈ నెల 31 వరకు పెంచినట్టు వర్సిటీ గాజువాక స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.కృష్ణ తెలిపారు. యూనివర్సిటీ అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ డిప్లమా, పీజీ డిప్లమా, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎంబీఏ ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:// ignouadmission.samarth. edu. in ద్వారా ప్రవేశాలను పొందవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం ఎంవీఆర్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో గాని, 0891–3514734 నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం



విజేతకు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్‌వర్మ

పరవాడ: పర్యావరణ, సామాజిక పాలన దక్షతను పెంపొందించుకోవడానికి పరిశ్రమల యాజమాన్యాలు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ సూచించారు. ఫార్మాసిటీలో ఎంఏఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రత ప్రాముఖ్యాన్ని వివరించారు. ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ ఫార్మాసిటీలో ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, జి.వి.వి.ఎస్.నారాయణ లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.రావు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రచారం



పాత అడవివరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పాత అడవివరంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, మజ్జి ధర్మా, రెడ్డి, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.